ప్రజాశక్తి
సోమవారం 3 ఫిబ్రవరి 2025 | 8 పేజీలు
ఎన్‌టిఆర్ | కృష్ణా





సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం

- రూ.10 కోట్లు కేటాయింపు
- ఆరు నెలల్లో వరద పనులు పూర్తి
- వివిఎంసి చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథరెడ్డి





ప్రజాశక్తి-విజయవాడ

ఈ వేసవి కాలంలో విజయవాడ నగర ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండటానికి వీలుగా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్' సిద్ధం చేసినట్లు విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ (సిఇ) ఆర్.శ్రీనాథరెడ్డి పేర్కొన్నారు. నగరానికి అతి ముఖ్యమైన మూడు ప్రాజెక్టుల వర్క్సుకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) తయారు చేయించే పనిలో ఉన్నామన్నారు. ఈ డిపిఆర్ తయారీకి దేశ స్థాయిలోని ఎనిమిది ప్రముఖ కన్సల్టెన్సీ కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. విజయవాడ నగరానికి ఎంతో ముఖ్యమైన, దీర్ఘకాలంగా మధ్యలోనే ఆగిపోయిన స్ట్రామ్ వాటర్ డ్రైయినేజీ పనులను పూర్తి చేయడం, 23/7 వాటర్‌సప్లై, సీవరేజ్ పంపింగ్ స్టేషన్లు వర్క్సుకు సంబంధించి పూర్తి స్థాయిలో డిపిఆర్ తయారీకి ప్రముఖ కంపెనీలు హాజరైనట్లు తెలిపారు. సమ్మర్ యాక్షన్‌ప్లాన్, వివిధ (మిగతా 2లో)

సచివాలయ ఉద్యోగుల వర్రీ

- కృష్ణాలో హేతుబద్ధీకరణకు మొదలైన కసరత్తు
- సచివాలయాల సంఖ్య 508
- మొత్తం పోస్టులు 5465
- ఖాళీ పోస్టులు 587



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణ కసరత్తు మొదలెట్టడం ఉద్యోగులను తీవ్ర అందోళనకు గురిచేస్తోంది. స్పష్టమైన సర్వీసు రూల్స్, జాబ్‌ఛార్టు రూపొందించక ముందే హేతుబద్ధీకరణ పూర్తయితే పోస్టుల సంఖ్య తగ్గి పని ఒత్తిడి పెరిగిపోతుందనే వాపోతున్నారు.

అర్బన్, రూరల్ ప్రాంతాల్లో వివిధ రకాల పౌర సేవలు అందించడంలో సచివాలయాలు కీలకంగా మారాయి. జిల్లాలోని మచిలీపట్నం నగరపాలక సంస్థ, గుడివాడ, పెడన, ఉయ్యూరు, తాడిగడప మున్సిపాల్టీలతో పాటు రూరల్ ప్రాంతంలో 6 లక్షల 20 వేలు కుటుంబాలుకు సేవలందిస్తున్నాయి. అర్బన్‌లోని వార్డు సచివాలయానికి 10 పోస్టులు, గ్రామ సచివాలయాల్లో 11 పోస్టులు కేటాయించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 123 వార్డు, 385 గ్రామ సచివాలయాల్లో 5,465 మంది వివిధ కేటగిరీల్లో ప్రభుత్వం నియమించింది. తర్వాత 587 పోస్టులు ఖాళీ అయ్యాయి. ఈ పోస్టులు భర్తీలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. తాజాగా జనాభా ప్రాతిపదికన సచివాలయాలను మూడు విభాగాలుగా, సిబ్బందిని రెండు కేటగిరీలుగా విభజించడానికి జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఏ కేటగిరీలో 2,500 జనాభాలోపున్న సచివాలయాల్లో ఇద్దరు మల్టీ పర్పస్ ఫంక్షనరీలు, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీలు, బి కేటగిరీలో 2500 నుంచి 3,500 జనాభా ఉన్న చోట ముగ్గురు మల్టీపర్పస్ ఫంక్షనరీలు, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీలు, 3501 జనాభాకుపైనున్న సచివాలయాల్లో నలుగురు మల్టీపర్పస్ ఫంక్షనరీలు, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీలు (మిగతా 2లో)

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి-విజయవాడ

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపిన కేంద్ర ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ విజయవాడ సెంట్రల్ సిటీలోని ప్రకాష్ నగర్ సెంటర్ వద్ద ఆదివారం సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యుడు పి.వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర నాయకులు చింతల శ్రీనివాస్, జి.ఝాన్సీరాణి మాట్లాడుతూ 2025 కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి, విజయవాడకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసే లేదన్నారు. ఎపిని చిన్నచూపు చూడటం పట్ల కూటమి ప్రభుత్వానికి అవమానకరంగా లేదా అని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం, బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు అవసరం లేదా? అందుకే రాష్ట్ర ప్రజలపై భారాలు వేస్తున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన 23 మంది ఎంపిలు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. అమరావతి అభివృద్ధికి నిధుల కేటాయింపు, రైల్వే జోన్ ప్రస్తావన లేదన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె పీరుసాహెబ్, స్టీఫెన్‌బాబు. ఎస్‌కె నిజాముద్దీన్, వి.మహేష్, ఆర్.శ్యాము, పి.రవి, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రకాష్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు









నెల్లూరులో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర మహాసభలో రాష్ట్ర నాయకులతో పాటు కృష్ణాజిల్లా నుండి మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు. కార్యదర్శి నివేదికపై చర్చలో పాల్గొన్న కళ్లం వెంకటేశ్వరరావు. రాష్ట్ర మహాసభలో కౌలు రంగం నుంచి చర్చల్లో పాల్గొన్న లక్ష్మణస్వామి, హరిబాబు

విఎంసి బడ్జెట్‌కు ఎన్నికల కోడ్ దెబ్బ

సకాలంలో తీసుకురావడంలో అధికార వైసిపి విఫలం

నిధులు, పథకాలు రాబట్టడంలో అధికార, ప్రధాన ప్రతిపక్షం బాధ్యతారాహిత్యం

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ అవసరాలకు అనుగుణంగా నిధులు రాబట్టడం...వివిధ రకాల పథకాలు, అభివృద్ధి పనులు పూర్తి చేయడం ఏమో కానీ...నిర్దేశించిన గడువులోగా బడ్జెట్ (2025-26) రూపకల్పన.. దాని ఆమోదం, సకాలంలో ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపడంలో విఎంసిలోని అధికారపక్షం ఘోరంగా విఫలం కాగా, ప్రధాన ప్రతిపక్షం టిడిపి కూడా మిన్నకుండి పోయింది. కౌన్సిల్‌లోని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపిల వ్యవహారం వలన బడ్జెట్ సమావేశం మరింత జాప్యం అయ్యే పరిస్థితి ఏర్పడింది.ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దెబ్బ విఎంసి బడ్జెట్‌పై ప్రభావం పడింది. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల షెడ్యూల్ గత నెల 29న విడుదలయిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) వచ్చే నెల 8వ తేదీ వరకు అమలులో ఉంటుంది. దీంతో ఎటువంటి బడ్జెట్ సమావేశాలు, అధికారికంగా ప్రారంభోత్సవాలు నిర్వహించరాదు. అయితే విఎంసిలో నెలకొన్న రాజకీయ అనిశ్చితి పరిస్థితి అన్ని రకాలుగా ప్రభావం చూపుతూనే ఉంది. కనీసంగా సకాలంలో బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించలేని అత్యంత దయనీయ పరిస్థితుల్లో విఎంసి రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే విచిత్రకరమైన పరిస్తితి ఏమిటంటే... ఈ నెల 3,4 తేదీల్లో బడ్జెట్ అంశాన్ని స్టాండింగ్ కమిటీలో చర్చించి, 12,13 తేదీల్లో బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని తేదీలను సైతం పై స్థాయిలో సిద్దం చేసినట్లు తెలిసింది. కౌన్సిల్‌కు తీసురావాల్సిన బడ్జెట్‌కు సంబందించి జమా-ఖర్చుల వివరాలతో కూడిన పద్దులను శాఖల వారీగా అధికారులు గత రెండు మాసాల క్రితమే పూర్తి చేసినట్లు తెలిసింది. నూతన బడ్జెట్ సుమారు రూ. 1030 కోట్ల మేర పద్దుల వారీగా అంచనాలు తయారు చేసినట్లు తెలిసింది. శాఖల వారీగా వారి వారి ఇప్పటి వరకు తీరిగ్గా ఉండి...తీరా ఎన్నికల కోడ్ రాబోతున్న తరుణంలో డేట్స్ నిర్ణయిస్తే ఫలితం ఏమిటనే దిశగా కూడా అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం, అధికారుల్లో సైతం చర్చ లేకపోలేదు. సరైన సమయములో సరైన ఆలోచన, నిర్ణయం చేయలేని పరిస్థితుల్లో ఇటువంటి పరిస్థితులే ఎదురవుతాయని, వీటన్నింటికీ మూల కారణం కౌన్సిల్‌లో కీలక స్థానంలో ఉన్న వారికి సరైన రాజకీయ అనుభవం, సమాలోచన, అందరినీ కలుపుకుపోయే తత్వం కొరవడటమే కారణమని రాజకీయపక్షాల్లో చర్చ నడుస్తుంది. అంతేగాక విఎంసిలోని వైసిపి పాలకవర్గాన్ని గైడ్ చేసే ఆపార్టీ నేతలు కూడా అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం కూడా ఇటువంటి పరిస్థితి తయారయిందనే చర్చ కూడా లేకపోలేదు. మరో ఆశ్చర్యకరమైన, విచిత్రకరమైన పరిస్థితి ఏమిటంటే.. .రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు కానీ, ఆపార్టీల కార్పొరేటర్లు కూడా విఎంసి బడ్జెట్ వ్యవహారంపై సకాలంలో జోక్యం చేసుకొని సలహాలు, సూచనలివ్వడం కానీ, అవసరమైయితే అధికార వైసిపిపై తమకున్న రాజకీయ పలుకుబడితో వత్తిడి తీసుకొచ్చి నిర్దేశించిన గడువులోగా సమావేశాన్ని జరిపించే అవకాశం ఉన్నప్పటికీ కనీసంగా పట్టించుకోకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని చెప్పక తప్పదు. కౌన్సిల్‌లో వైసిపి అధికారపక్షం అయినా..మారిన రాజకీయ పరిస్థితుల్లో గడిచిన ఈ మూడు కౌన్సిల్ సమావేశాల్లో టిడిపి సభ్యుల మాట నెగ్గుతూనే ఉంది. మరో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే నగరాభివృద్ధి, నిధులు రాబట్టడం, ప్రజల సమస్యల పరిష్కారంలో కూటమికి చెందిన స్తానిక



ఎమ్మెల్యేలు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉన్నారనే విమర్శ వ్యక్తం అవుతుంది. స్థానిక ఎమ్మెల్యేలు గెలిచి ఏడు మాసాలు గడిచినా నేటికీ కౌన్సిల్‌లో అడుగు కూడా పెట్టలేదు. కనీసంగా ఎక్స్ అఫిషియో మెంబర్స్‌గా నగరానికి చెందిన ఎమ్మెల్యేలు కౌన్సిల్‌లో ప్రమాణ స్వీకారం కూడా నేటికీ చేయలేదు. వారి వారి సొంత వ్యవహారాల్లో మునిగితేలుతున్నారనే విమర్శ లేకపోలేదు. అధికార వైసిపిలో కీలక స్థానంలోఉన్నవారిలో అవగాహన రాహిత్యం, అనైక్యత, ఒంటెద్దుపోకడలు, ప్రధాన ప్రతిపక్షం టిడిపి బాధ్యతారాహిత్యం వెరసి బడ్జెట్ సమావేశాల అనిశ్చితి పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావం బడ్జెట్ సమావేశంపై పడింది. అయితే బడ్జెట్ సమావేశాలకు ఎదురయ్యే ఆటంకాలు, అడ్డంకులను అధిగమించడానికి ముందస్తుగానే అంచనా వేయడం, తగిన జాగ్రత్తలు, చర్యలపై అటు పాలకవర్గం, అధికారులు సమాలోచనలు చేయడం అవసరమయితే బడ్జెట్ డేట్‌ను కొంత ముందుకు జరిపి, సమావేశాన్ని నిర్వహించి, ఆమోదించిన బడ్జెట్ తీర్మానాలను, తగిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించే ఒక రకమైన కసరత్తు చేయాల్సి ఉంటుంది. సీనియర్ కార్పొరేటర్ల సలహాకానీ, అనుభవం కల్గిన నేతల సలహాలను స్వీకరించే పరిస్థితుల్లో కౌన్సిల్‌లో కీలక స్థానంలో ఉన్న వారు లేరనే విమర్శ బహాటంగా వినిపిస్తుంది. బడ్జెట్, నగరాభివృద్ధి, ఇతర అంశాలకు సంబంధించి అటు అధికారపక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షం అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ ప్రజలను సమస్యల సుడిగుండంలో ముంచుతున్నారనే చర్చ జరుగుతుంది.

పిజిఆర్ఎస్‌కు తాత్కాలిక విరామం

ప్రజాశక్తి-విజయవాడ: ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఎన్‌టిఆర్ జిల్లాలో కోడ్ అమల్లో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల మూడవ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం కార్యక్రమానికి తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ప్రజలు తమ అర్జీని మీకోసం ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చని, ఇందుకు తమ సమీప గ్రామ లేదా వార్డు సచివాలయాన్ని సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.

మొదటిపేజీ తరువాయి

సచివాలయ ఉద్యోగుల వర్రీ

ఉండేలా హేతుబద్ధీకరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనికి అనుగుణంగా ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నారు.

ఇప్పటికే పని ఒత్తిడి

2019 అక్టోబర్‌లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినా ఉద్యోగులకు సరైన జాబ్ చార్టు లేకపోవడం సమస్యగా మారింది. మల్టిపర్పస్ సేవలు పేరుతో పది శాఖలు అధికారులు చెప్పిన పనులు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు గత ఏడు నెలలుగా వాలంటీర్లు సేవలు (ఫించన్‌ల పంపిణీ, ప్రభుత్వ సర్వేలు) చేయాల్సి వస్తోంది. ఉదయం ఐదున్నరకే పింఛన్‌లు పంపిణీ చేయాల్సి రావడంతో మహిళా ఉద్యోగులు, దూర ప్రాంతంలోని ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వేలతో పని ఒత్తిడితో సతమతమవుతున్నారు.

సర్వీసు రూల్స్ తర్వాతే హేతుబద్ధీకరించాలి

జి.గోపిచంద్, గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు

సచివాలయాల హేతుబద్ధీకరణకు ముందు ఉద్యోగులకు స్పష్టమైన సర్వీసు రూల్స్‌ను రూపొందించాలి. జాబ్ చార్టు ఏర్పాటు చేయాలి. దీనికి అనుగుణంగా ఒకే అధికారి పర్యవేక్షణలో విధులు నిర్వహించే అవకాశం కల్పించాలి. ఉద్యోగులకు ప్రమోషన్ ఛానల్ కల్పించాలి. సచివాలయ ఉద్యోగులందరికి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింప చేయాలి. వివిధ సర్వేల నుంచి విముక్తి కల్పించాలి.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం

ప్రాజెక్టులు, పలు అభివృద్ధి పనులపై శ్రీనాథరెడ్డి 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: సమ్మర్ యాక్షన్ ప్లాన్ వివరాలను తెలపగలరు?

జవాబు: ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తుంటే ఈ ఏడాది కూడా ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితులు, రాబోయే నీటి ఎద్దడి రాకుండా, గత అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఎక్కడా ఎటువంటి నీటి సమస్య తలెత్తకుండా ఉండటానికి నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయడం జరిగింది. ప్రధానంగా ఎక్కడెక్కడ మంచినీటి అవసరాలో అటువంటి చోట అదనపు బోర్ వెల్స్ వేయడం జరుగుతుంది. అలాగే ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు, అవసరమైన చోట్ల మంచినీటి పైపులైన్ల మరమ్మతులు తదితర పనులు చేపట్టడం జరుగుతుంది.

ప్రశ్న: సమ్మర్ యాక్షన్‌ప్లాన్ అమలుకు ఎంత నిధులు కేటాయిస్తున్నారు?

జవాబు: రక్షిత నీటి అవసరాలకనుగుణంగా రూ.10 కోట్ల వరకు కేటాయించడం జరిగింది. ఈ నిధుల కోసం కౌన్సిల్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది.

ప్రశ్న: నగరంలో చేపట్టబోయే ప్రధాన ప్రాజెక్టులు వివరించగలరు?

జవాబు: నగరంలో ముఖ్యంగా మిగిలిపోయిన స్టామ్‌వాటర్ డ్రైయినేజీ పథకం పనులు పూర్తి చేయాలి. అంతేగాక సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ పంపింగ్‌స్టేషన్లు, అలాగే స్ట్రామ్ వాటర్ డ్రైయినేజి వ్యవస్థ ద్వారా నగరంలోని నీటిని బుడమేరులోకి మళ్లించడానికి అవసరమైన సంప్‌ల నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంటుంది.

ప్రశ్న: ఇంకా స్ట్రామ్ వాటర్ డ్రైయినేజి పనులు ఎన్ని కిలోమీటర్లు చేయాల్సి ఉంటుంది?

జవాబు: గతంలో చేపట్టి పూర్తి చేసిన వర్క్సును పరిశీలిస్తే ఇంకా నగర పరిధిలో 800 కిలోమీటర్ల పొడవున డ్రైయినేజీ నిర్మాణ వ్యవస్థను పూర్తి చేయాలి. దీనికి సంబంధించి సుమారు రూ. ఐదారు వందల కోట్ల మేర ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు కేవలం 260 కిలోమీటర్ల మేర ఆయా వార్డుల్లో డ్రైయినేజి నిర్మాణపు పనులు పూర్తి అయ్యాయి. అయితే పూర్తి చేసిన డ్రైయినేజి వ్యవస్థ పరిధిలో ఇంకా 290 చోట్ల గ్యాప్స్ వర్క్సును పూర్తి చేయాల్సి ఉంది. వీటి లెంత్ సుమారు ఐదు కిలోమీటర్లు మేర ఉంటుంది. ఎల్ అండ్ టి కంపెనీ ద్వారా పూర్తి చేయడం జరిగింది. ఈ సారి ఎల్ అండ్‌టి కంపెనీకి కాకుండా వేరే కంపెనీకి ఈ వర్క్సును ఇవ్వడం జరుగుతుంది. 1996-97లో ప్రారంభమైన ఈ డ్రైయినేజి స్కీమ్ 2022లో పూర్తిగా వర్క్ నిలిచిపోయింది.ఈ పథకానికి మొత్తం రూ.461 కోట్లు నిధులు ఆనాడు కేటాయించగా, రూ.199 కోట్ల మేర వర్క్ పూర్తి చేయగా, వాటిల్లో 153 కోట్లు బిల్లుల పనులు చేసిన సదరు ఎల్ అండ్ టి కంపెనీకి ఇవ్వడం జరిగింది. మిగిలిన రూ.46 కోట్లు ఇంకా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రశ్న: గత ఏడాది సెప్టెంబర్‌లో సంభవించిన వరదకు దెబ్బతిన్న రోడ్లు, డ్రైయిన్ల వర్క్సుకు ఇంకా ఎన్ని కోట్ల మేర పనులు చేయాల్సి ఉంది?

జవాబు: రూ.38.40 కోట్ల అంచనా మేర రోడ్లు, డ్రైయిన్లు, వాటర్ సప్లై వర్క్సు పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నిధులను జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేయడం జరుగుతుంది. ఆరు మాసాల్లో ఈ పనులను పూర్తి చేయాలి.

ప్రశ్న: అమృత్ పథకంలో ఇన్సెంటివ్ గ్రాంట్ కింద ఎంత మంజూరు అయింది?

జవాబు: ఈ పథకం కింద రూ.30 కోట్లు విఎంసికి మంజూరు కాగా వాటిని స్ట్రామ్ వాటర్ డ్రైయినేజీ స్కీమ్‌లో పెండింగ్‌లో ఉన్న గ్యాప్ వర్క్సుకు కేటాయించి, పూర్తి చేయడం జరుగుతుంది.

ప్రశ్న: సింగ్‌నగర్ ప్రాంత నీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: సింగ్‌నగర్ నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. హెడ్ వాటర్ వర్క్సు నుంచి రా వాటర్‌ను పైప్‌ల ద్వారా సరఫరా చేసి, సింగ్‌నగర్‌లో 46 ఎంఎల్‌డి సామర్థ్యం కల్గిన ఫిల్టరేషన్ ప్లాంట్ ద్వారా నీటి శుద్ధి చేసి, సరఫరా చేయడం జరుగుతుంది. ఈ పనులు కూడా త్వరలో చేపట్టాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం తూర్పు నియోజకవర్గం పరిధిలోని కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వర్ ఏరియాలోని ప్రజలకు 46 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు హెడ్ వాటర్ వర్క్సు నుంచి 4.8 కిలోమీటర్ల పొడవున మంచినీటి పైప్‌లైన్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ స్కీమ్‌కు రూ.100 కోట్ల అమృత్ పథకం నుంచి నిధులు వ్యయం చేయడం జరుగుతుంది.

గుణదల ఉత్సవాలకు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: గుణదల మేరీ మాత టెంపుల్ మరియు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న బందోబస్తు ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఆదివారం బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, లా అండ్ ఆర్డర్ పరంగా, ట్రాఫిక్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు తగు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా నగర్ పోలీస్ కమిషనర్ గారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుంచి నగరంలో గుణదల మేరీమాత ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుని పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈసారి ప్రత్యేకంగా మేరీ మాత టెంపుల్ మరియు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు డ్రోన్లతో ఆధునిక సాంకేతికను ఉపయోగించుకుని పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుంది, పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుంది, చిన్నపిల్లల భద్రతపై, నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు, పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి గౌతమి షాలి, ట్రాఫిక్ ఎడిసిపి ప్రసన్నకుమార్, సౌత్ ఏసిపి డి పవన్‌కుమార్, ట్రైనీ డీఎస్పీ పావని పాల్గొన్నారు.



మోపిదేవి టోల్‌గేట్ వద్ద ప్రమాదకరంగా దిమ్మెలు



రోడ్డుపై ప్రమాదకరంగా మేకులతో ఉన్న దిమ్మె

ప్రజాశక్తి-మోపిదేవి : జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. వెహికల్స్ క్రాసింగ్ సమయంలో రహదారిపై ఇనుప ముళ్ళు ఉంచిన దిమ్మలు, విరిగిపడిపోయిన ఇనుప కడ్డీ పిల్లర్లు రహదారికి అవరోధాలుగా టోల్గేట్ సిబ్బంది ఉంచుతున్నారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్గేట్ నిర్వాహకుల పనితీరుపై పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి వెంబడి వెలగాల్సిన విద్యుత్ దీపాలు కూడా వెలగడం లేదు. వాహనాల దగ్గర టోల్ వసూలు చేసేటప్పుడు రహదారి నిర్వహణ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన కనీస చర్యలను కూడా టోల్గేట్ సిబ్బంది తీసుకోకపోగా ప్రమాదాలు జరగడానికి ఆస్కారంగా టోల్గేట్ వద్ద అవరోధాలు కల్పిస్తున్నారని విమర్శలు ఎక్కువవు తున్నాయి. పక్క చిత్రంలో కనిపిస్తున్న సిమెంట్ దిమ్మపై ఉన్న పదునైన మేకులు వాహన చోదకులకు పాదచారులకు కూడా ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఉంది. టోల్గేట్ సమీపంలో పాఠశాలలు కూడా ఉండడంతో విద్యార్థులు నిత్యం అటుగా తిరుగుతూ ఉంటారు. అవనిగడ్డ సబ్ డివిజనల్ పోలీస్ యంత్రాంగం స్పందించి టోల్గేట్ వద్ద భద్రత చర్యలను పటిష్టం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

లారీ కిందపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రమాదవశాత్తు లారీ కిందపడిన 85 సంవత్సరాల వృద్ధుడి తల నుజునుజ్జయిన విషాదకర సంఘటన ఘంటసాల మండలంలో ఆదివారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం చల్లపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన వేములపల్లి పూర్ణచంద్రరావు(85) ఘంటసాల మండలం దాలిపర్రు గ్రామంలో సమీప బంధువు ఒకరు మతి చెందటంతో పరామర్శించడానికి వెళ్లారు. పరామర్శ అనంతరం టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి పలుగుల గండి వద్ద బైపాస్ రోడ్డు ఎక్కే క్రమంలో బందరు వైపు నుంచి వస్తున్న లారీ ఒక్కసారిగా పూర్ణచంద్రరావును బలంగా ఢీ కొనటంతో తలభాగం చిద్రమై చనిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించి, మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు : కోడిపందేలు నిర్వహిస్తున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఆరు వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పెనమలూరు ఎస్ఐలు ఫిరోజ్,వెంకటేశ్వరరావు తెలిపారు. యనమలకుదురు గ్రామంలోని కష్ణానది ఒడ్డున కోడిపందాలు నిర్వహిస్తున్న సమాచారంతో అక్కడికి ఎస్ఐలు తమ సిబ్బందితో వెళ్లి పందేలు ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఎవరైన పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెంకటేశ్వరరావు మృతిపట్ల సంతాపం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆరో వార్డుకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘం నాయకులు (మెకానిక్ వెంకటేశ్వరరావు) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. వెంకటేశ్వర మరణం పట్ల మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సంతాపం తెలిపారు. వెంకటేశ్వరరావు భౌతికకాయంపై పూల మాల వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒక మంచి కార్యకర్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ బీసీ సంఘాల నాయకులు పార్టీ కార్యకర్తలు వెంకటేశ్వరరావుకు నివాళులర్పించారు. వెంకటేశ్వరావుకు భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు.

డంపింగ్ యార్డును వేరే చోటుకు మార్చాలి



ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నాగాయలంక రోడ్ లో ఉన్న డంపింగ్ యార్డ్‌ని ఆ ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి తరలించాలని వైసీపీ యువనేత బడే గౌతం కోరారు. ఆదివారం డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించిన గౌతమ్ విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ పంచాయతీలో 25వేల జనాభా పైపడి ఉన్నారని అయినప్పటికీ నగర పంచాయతీ కి కావలసిన అన్య అర్హతలు ఉన్నప్పటికీ ఇంకా అవనిగడ్డ మేజర్ పంచాయతీలో ఒకటిగా కొనసాగడం విచారకర మన్నారు. ఇంతటి జనాభా కలిగిన అవనిగడ్డ పంచాయతీలోని చెత్తను అంత పంచాయతీ వారు అవనిగడ్డ నాగాయలంక రోడ్లో ఈస్ట్ కోస్ట్ సమీపాన రోడ్డు పక్క మార్గంలో డంపు చేస్తున్నారన్నారు. విపరీతంగా పేరుకుపోయిన చెత్తను ప్రతిరోజు కుక్కలు పందులు లాగడంతో అందులోని వ్యర్థాలు జంతు కళేబరాలు రోడ్డుపైకి వచ్చి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోందన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణించే వారికి ఇది తీవ్ర ఇబ్బందిగా నరకయాతన అనుభవిస్తున్నా రన్నారు. ఈ చెత్తను పంచాయతీ వారు తగలబెట్టి నప్పుడు వచ్చే పొగ మంట వలన ఆ రోడ్లో ప్రయాణించే వాహనదారులు ఎవరు అసౌకర్యానికి గురవుతు న్నారన్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఊరికి చివర్న డంపింగ్ యార్డ్ కు స్థలాన్ని కేటాయించి వేస్ట్ మేనేజ్మెంట్ ప్రోగ్రామ్ను అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని గౌతమ్ డిమాండ్ చేశారు.

'లక్ష డప్పులు - వేల గొంతులు' గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని గరికపర్రులో ఆదివారం బాబు జగజ్జివన్ రావు విగ్రహం ముందు లక్ష డప్పులు - వేల గొంతులు గోడపత్రికను ఆవిష్కరించారు. పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాలానుసారం ఫిబ్రవరి 7 వ తేదీన హైదరాబాద్ లో లక్షల డప్పులు - వేల గొంతులు కార్యక్రమం నిర్వహిస్తు న్నారని, ఈ కార్యక్రమానికి వేలాదిగా డప్పు కళాకారులు, మాదిగ యువత తరలిరావాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఇంటూరీ భాను మాదిగ తెలిపారు. గోడపత్రిక విడుదల కార్యక్రమంలో శీలం నాగరాజు మాదిగ, ఇంటూరు రాము మాదిగ, గుర్విందపల్లి రాజేష్ మాదిగ, జుజ్జువరపు చరణ్ మాదిగ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఈనెల 7వ తేదీన జరుగు ఛలో హైదరాబాద్ లక్ష డబ్బులు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు అన్నారు. స్థానిక పాలసీతలీకరణ సమావేశపు మందిరంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కష్ణమాదిగ పిలుపుమేరకు .. చలో హైదరాబాద్ లక్షలడప్పులు.. వేల గొంతులుబి కార్యక్రమానికి ఎంఆర్‌పిఎస్ నాయకులు, మాదిగ యువత హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుల్లాకింగ్ త్యాగరాజుమాదిగ.. రాయల్ ప్రభాకర్, జుజ్జవరపు సురేంద్ర, పరిచిపోగు పోలయ్య, కోలాంటి రవిబాబు, అర్జున్ రావు దానియేలు,. గుంటకాని రాజు తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం



గుడ్లవల్లేరు మండలంలో...

చేనేతల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం : ఏప్రిల్ 27న గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంతంలో రాష్ట్రస్థాయి చేనేత కార్మికుల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు కదిరి ఎమ్మెల్యే, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నేత కందికుంట వెంకట ప్రసాద్, జాతీయ అధ్యక్షులు ఆనంద ప్రసాద్ ప్రకటించారు. గన్నవరంలోని శ్రీ మల్లికార్జున విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం రాష్ట్రస్థాయి చేనేత ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకటప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం వీవర్స్‌కు ప్రత్యేక నిధులు కేటాయించడం ద్వారా భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి చూపుతున్న చేనేత రంగం తన ఉనికిని చాటుకునేందుకు పోరు బాటకు సిద్ధం కావలసిన సమయం వచ్చిందన్నారు. రాజకీయంగా బల పడేందుకు.. అసెంబ్లీ స్థానాల్లో తమ వాటా కోసం రాష్ట్రం లోని చేనేత కులాలను ఫెడరేషన్ ఏకం చేస్తోందన్నారు. అఫ్-కో చైర్ పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత మాట్లా డుతూ రాష్ట్రంలోని చేనేత కార్మికుల స్థితిగ తులను, వత్తిపరంగా ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఆత్మగౌరవ సభకు సిద్ధమైనట్లు తెలిపారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు నక్కిన చిన వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అభిరామ్ (ఫైల్)

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అవనిగడ్డ రెండో వార్డుకు చెందిన కోసూరి అభిరామ్ (32) మృతి చెందాడు. ద్విచక్ర వాహ నంపై వస్తు అదుపుతప్పి పడటంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అభిరామ్ మోపిదేవి లోని బ్రాందీ షాపులో వాటా ఉండటంతో మధ్యాహ్న భోజన సమయంలో తిరిగి అవనిగడ్డకు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా పులిగడ్డ సర్కిల్ సమీప ప్రాంతంలో వాహన అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో అభిరామ్ కి తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మతి చెందాడు. పోస్ట్ మార్టం అనంతరం మతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఇరువురికి గాయాలు



గాయపడిన వ్యక్తి



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం అరిసేపల్లి పంచాయతీ హుస్సేన్ పాలెం సమీపంలో హైవేపై కూలీలను ఢీకొ ట్టిన కారు ప్రమాదంలో ఇరువురు కూలీలు తీవ్రంగా గాయ పడ్డారు. ఆదివారం హైవేపై జరిగిన ఈ ప్రమాదంలో కూలీలను ఢీకొట్టిన కారు పొదల్లోకి దూసుకు వెళ్లింది. గాయాల పాలైన ఇరువురిని పోలీసులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. గాయాలపాయలైన ఇరువురు మచిలీపట్నం మండలం పాట్లపాలెం గ్రామానికి చెందిన వేణు రాంబాబు, వేణు కొండయ్యగా తాలూకా పోలీసులు గుర్తించారు. కూలీలను ఢీకొట్టిన కారు జనసేన పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యేదిగా బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అందుకే పోలీసులు దగ్గరుండి కారును తరలించేసారంటూ బంధువులు ఆరోపి స్తున్నారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సముద్రంలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతు




సుబ్బారావు (ఫైల్)

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం తాళ్లపాలెం పంచాయతీ సముద్ర తీర ప్రాంత గ్రామమైన సత్రవపాలెంకు చెందిన మత్స్యకారుడు చింతా ఏడుకొండలు ఆలియాస్ పెద సుబ్బారావు (61) మచిలీపట్నం తీరంలో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. శనివారం సాయంత్రం సత్రవపాలెం గ్రామానికి చెందిన పడవలో తోటి జాలర్ల బందంతో వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. చింతా ఏడుకొండలు రాత్రి తమతోనే ఉన్నాడని, ఒకవేళ నిద్రపోతూ అలల ఒడిదుడుకులకు పడవ నుంచి సముద్రం లోనికి జారిపోయి ఉండచ్చోమోనని తోటి మత్స్య కారులు అనుమానిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి తమ బందంతో చింతా ఏడుకొండలు లేకపోవడాన్ని గమనించిన వారు సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతన్నాయి.

నేడు నందిగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సోమవారం జరగనుంది. నందిగామ పురపాలక సంఘం తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్‌ల సంఖ్య 11 (ప్రస్తుతం అంటే వైసిపి నుంచి జంప్ అయి వచ్చిన ఆరుగురుతో కలిపి) అయితే 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికలో అప్పుడు వైసిపి గెలుచిన కౌన్సిలర్‌లు 13 మంది, ఇద్దరు మరణం తర్వాత వీరి సంఖ్య 11గా ఉంది. అయితే సోమవారం నాడు జరుగనున్న చైర్మన్ పదవి ఎంపికకు టిడిపి ఆ 11 సంఖ్య కౌన్సిలర్‌లతో పోటీ చేసి చైర్మన్ పదవి కైవసం చేసుకునేందుకు సిద్ధమైంది. వైసిపి 11 సంఖ్య నుంచి ఐదుకు పడిపోయింది. గత మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి పోటీ చేసి ఆరుగురు కౌన్సిలర్‌లను గెలిచింది. ఒకరు వైసిపికి జంప్ కావడంతో ఐదుగురు మిగిలారు. ఇప్పుడు గతంలో 11 కౌన్సిలర్‌లు ఉన్న వైసిపి అప్పట్లో దేశం పార్టీకి ఉన్న ఐదుగురు కౌన్సిలర్‌లున్నారు. అప్పట్లో ఐదుగురు కౌన్సిలర్‌లు ఉన్న తెలుగు దేశం పార్టీ ఇప్పుడు 11 మంది ఉన్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా రాష్ట్రంలో 11 స్థానాలతో వైసిపి భారీ ఓటమి చూసింది. ఇక్కడ నందిగామ పురపాలక సంఘం చైర్మన్ పదవికి అదే 11 ఫిగర్‌తో చైర్మన్ పదవి కైవసం చేసుకునేందుకు సిద్ధమైంది. 11 మంది కౌన్సిలర్‌లతో టిడిపికి పూర్తి మెజారిటీ ఉంది. ఎట్టకేలకు నందిగామ పురపాలక సంఘం చైర్మన్ పదవికి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఈ చైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు అవకాశం దక్కింది. ఈ నోటిఫికేషన్ విడుదల అయిన తరువాత సైతం మరో వైసిపి కౌన్సిలర్ దేశం తీర్థం పుచ్చుకోవడం, మరో వైసిపి కౌన్సిలర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో వైసిపి బలం నాలుగుకు పడిపోయింది. తెలుగు దేశం పార్టీ బలం కౌన్సిల్‌లో 12కు చేరింది. ఒక జనసేన కౌన్సిలర్ ఉండగా, మరో కౌన్సిలర్ వైసిపికి రాజీనామా చేసి అలాగే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా వైసిపికి చెందిన 7, 11 వార్డులకు చెందిన మహిళలు ఖాళీగా ఉన్న ఆ రెండు వార్డులకు పోటీ నిర్వహించి ఆ తర్వాత చైర్మన్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఇలా మూడో తేదీన రాష్ట్రీయ ఎన్నికల కమిషన్ చైర్మన్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. అదే రోజు ఈ చైర్మన్ పదవి ఎన్నిక నిలిపివేయాలని 7, 11 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించాలని వేసిన రిట్ పిటిషన్ పై తీర్పు అదే రోజుకు వాయిదా వేసింది. దీంతో కోర్టు ఏం తీర్పు ఇస్తుందో ఆసక్తిగా మారింది. అయితే కోర్టు తీర్పు వచ్చేలోగా చైర్మన్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని అధికార పార్టీ పావులు కదుపుతోంది.

దేశం పార్టీలో చైర్మన్ పదవికి ఆశావహులు ఎక్కువగా ఉండటంతో ఎంఎల్‌ఏ సౌమ్య పై ఒత్తిడి విపరీతంగా ఉంది. ఈ నేపథ్యంలో తాను చెప్పేవారికే



చైర్మన్ పదవి అంటూ నేటి వరకు కూడా ఎవరి పేరు ప్రకటించక పోవడంతో మరింత ఆసక్తికరంగా మారింది. కేవలం ఎన్నిక నిర్వహించే కౌన్సిల్ హాల్ లో మాత్రమే ఎంఎల్‌ఏ చైర్మన్ పదవికి అభ్యర్థి పేరు ప్రకటిస్తానని ఖరాఖండిగా చెప్పేసారు. ఈ నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థుల రేసులో ఉన్న వారికి కూడా గుబులు పుట్టిస్తోంది. తాజాగా ఆదివారం వైసిపి అధినాయకత్వం రాష్ట్రంలో జరుగుతున్న మేయర్ డిప్యూటీ మేయర్ చైర్మన్ వైస్ చైర్మన్ సోమవారం జరగనున్న ఎన్నికలకు తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లకు కౌన్సిలర్లకు విప్పి జారీ చేసింది. ఈ నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లు విప్‌ను వ్యతిరేకించి ఇతర పార్టీలకు ఓటేస్తే వారిని ఆ పదవులకు అనర్హత వేటు వేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నందిగామ పురపాలక సంఘంలో వైసిపి కౌన్సిలర్లు ఏడుగురు దేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న వారు సోమవారం జరిగే చైర్మన్ పదవికి ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తారో వేచిచూడాల్సిందే మరి.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీ విద్యా పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో శ్రీ విద్య పబ్లిక్ స్కూల్లో 16 – వ వార్షికోత్సవ కార్యక్రమాలు గత రెండు రోజుల నుంచి ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ శాసన సభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య హాజరయ్యారు. అనంతరం సభను ఉద్దేశించి సౌమ్య మాట్లాడుతూ శ్రీ విద్య పబ్లిక్ స్కూల్లో అభ్యసించిన విద్యార్థులు ఉన్నతమైన స్థాయిలో ఉన్నారని తెలిపారు. దేశ విదేశాల్లో మంచి గుర్తింపు పొందిన సంస్థలలో ఉద్యోగాలు కూడా సంపాదించారని పేర్కొన్నారు. ఇంత గొప్ప విద్యా సంస్థ ద్వారా పిల్లలకు విద్యను అందించటం ఎంతో అభినందించదగ్గ విషయమని అన్నారు. క్రమశిక్షణ సత్ప్రవర్తనతో కూడిన విద్యను అందిస్తున్న చైర్మన్ కందుల మల్లికార్జునరావు డైరెక్టర్ రామును, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. సభ అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యా సాంస్కృతిక క్రీడా విభాగ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థిగా ఫస్ట్ క్లాస్‌కు చెందిన గుడిగుంట్ల శ్యామలకు అవార్డు అందించి ఎంఎల్‌ఏ ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, స్కూల్ యాజమాన్య ఆశీస్సులు అందించారు. పాఠశాల గౌరవ అధ్యక్షులు డా. కందుల అప్పారావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కందుల మల్లిఖార్జున రావు, పాఠశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మేకల రాము, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాత్రికులతో సందడిగా గుణదల కొండ

3వ రోజుకు చేరుకున్న నవదిన ప్రార్థనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేవుని తల్లి అయిన మరియమాత ఆధ్యాత్మిక తల్లిగా విరాజిల్లుతూ యాత్రికుల చేత నీరాజనాలు అందుకొంటుందని అవనిగడ్డ విచారణకర్తలు ఫాదర్ గొర్రు సురేష్ మెర్లో అన్నారు. గుణదల లూర్థుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన ప్రార్థనలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన యాత్రికులకు సందేశమిస్తూ యాత్రికులకు వరాలు ఇచ్చే మాతగా మరియతల్లి ఘనత కెక్కిందని తెలిపారు. మరియమాత ప్రార్థన సహాయం ద్వారా ఎన్నో అద్భుతాలు జరిగాయని యాత్రికులకు వివరించారు. 3వ రోజు నవదిన ప్రార్థన ఆదివారం కావటంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో పుణ్యక్షేత్ర ప్రాంగణం, గుణదలకొండ భక్తులతో సందడి సందడిగా మారింది. అంతకుముందు ఫాదర్ గొర్రు సురేష్ మెర్లో, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు స్వామి, డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ఎస్ఎస్ సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్కుమార్ తదితర గురువులు 'పవిత్ర దివ్యసత్ప్రసాద మందనంతో' ప్రధాన దేవాలయం నుండి కొండపై లూర్థుమాత గుహవద్దకు చేరుకున్నారు. అనంతరం గురువులు 'సమిష్టి దివ్యపూజాబలి' సమర్పించారు. సెయింట్ పీటర్స్ కథెడ్రల్, గొల్లపూడి, రాణిగారి తోట, తదితర విచారణల నుండి హాజరైన యాత్రికులు ఉత్తరించు స్థలంలో ఉన్న ఆత్మల కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ జే జాన్ రాజు, ఫాదర్ జాన్ పీటర్, ఫాదర్ తోట సునీల్ రాజు, ఫాదర్ ఎం ప్రకాష్ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతే విజయ సూత్రం

దిగ్గజ క్రికెటర్, మోటివేషనల్ స్పీకర్ జాంటీ రోడ్స్ - స్ఫూర్తిదాయకంగా బీఎన్ఐ నెట్వర్కింగ్ కాంక్లేవ్ 3.0



కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఐక్యతే విజయానికి మూలసూత్రమని, బృంద స్ఫూర్తితో కృషి చేయడం ద్వారా అద్భుత విజయాలను సాధించొచ్చని దిగ్గజ క్రికెటర్, ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ జాంటీ రోడ్స్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన బిఎన్ఐ నెట్‌వర్కింగ్ కాంక్లేవ్ 3.0లో ఆయన కీనోట్ ప్రసంగం చేశారు. క్రికెట్ ఆటలో అసాధారణ ఫీల్డింగ్ నైపుణ్యానికి చిరునామాగా ఖ్యాతి గడించిన జాంటీ రోడ్స్ ప్రసంగం బిఎన్ఐ సదస్సుకు హాజరైన వాణిజ్యవేత్తల్లో స్ఫూర్తి నింపింది. బిఎన్ఐ నెట్వర్కింగ్ కాంక్లేవ్ 3.0లో జాంటీ రోడ్స్ మాట్లాడుతూ.. క్రికెట్ మైదానంలో జట్టు సభ్యులందరూ సమన్వయంతో ఆడితే విజయం



మాట్లాడుతున్న జాంటీ రోడ్స్

సాధించినట్లుగానే, వ్యాపార రంగంలోనూ పరస్పర సహకారంతో విజయ పథంలో దూసుకెళ్లవచ్చని అన్నారు. సమయానుకూల నిర్ణయాలు, సత్వర కార్యాచరణతో అద్భుత విజయాలు సాధ్యమవుతాయని చెప్పారు. మార్కెట్ సరళిని ఎప్పటికప్పుడు విశ్లేషించు కుంటూ, పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. వాణిజ్యవేత్తల నడుమ అనుబంధాన్ని పెంపొందించి, సభ్యులందరి వ్యాపార వృద్ధికి మహత్తర వేదికగా బిఎన్ఐ నిలుస్తుందని అన్నారు. బీఎన్ఐ విజయవాడ చాప్టర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నెట్వర్కింగ్ కాంక్లేవ్ 3.0లో 1500 మందికి పైగా ప్రముఖ వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. వేర్వేరు అంశాలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో నూతన వ్యాపార అవకాశాలు, వాణిజ్య వ్యూహాలపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయి. వ్యాపారవేత్తల నడుమ అనుబంధం కొనసాగేలా అధునాతన సాంకేతిక వ్యవస్థను బీఎన్ఐ తీర్చిదిద్దిందని బీఎన్ఐ విజయవాడ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ 3.0 చైర్మన్ మేఘన ఆచంట, మెంటార్ నండూరి త్రినాథ్, కన్వీనర్ పి.యువ కిషోర్, ట్రెజరర్ మద్దినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

వివిధ జిల్లాల నుండి 180 మంది క్రీడాకారులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కానూరులోని స్కాట్ స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం మొదటి రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహ భరితంగా జరిగాయి. ఈ పోటీలలో వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ కేటగిరీలోలలో జరిగిన పోటీలలో ఓపెన్ కేటగిరీలో డి.ధృవీస్, సిహెచ్.శర్వాణి, ఎన్.ప్రీతం దర్శన్ వరుసగా ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలను సాధించారు. అండర్ – 7 బాలుర కేటగిరీ లో కె.సుహృత్, రెయిన్, ఎస్. అద్వైత మొదటి మూడు స్తనాలు సాధించారు. బాలికల విభాగంలో మరియం, అక్షర, ఎస్.శ్రీజ మొదటి మూడు స్తనాలు సాధించారు. అండర్ – 9 బాలుర విభాగంలో సాత్విక్ రెడ్డి, సురచిత్, ప్రభంజనం నాయుడు మూడు స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో మోక్షిత , హర్షిత, దివిష ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ఉన్నారు. అండర్ – 11 విభాగంలో కె. హర్షిత్, హేమేశ్వర కార్తీక్, తేజ్ భారత రెడ్డి, బాలికల విభాగంలో పి.గీతిక, రూపా సాయి కృష్ణ, యశస్వి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ఉన్నారు. అండర్ – 13 బాలుర విభాగంలో ఆర్.త్రిలోక్, కె.చిరాగ్, పి.మహీంద్ర, బాలికల విభాగంలో జయ అభిల్య, సాత్విక నాగ సాయి, ఎం.వర్షిత మొదటి మూడు స్థానాలు సాధించారు. అండర్ – 15 విభాగంలో కృష్ణ చైతన్య, సాయి శ్రీకర్, అనీష్ బాలికల విభాగంలో సోనాలి, తన్మయి, అక్షర వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో స్కాట్ స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్ సి. ఈ. వో. కె. జాహ్నవి, ఎస్. ఆర్.ఆర్. చెస్ కోచింగ్ అకాడమీ ప్రెసిడెంట్ జె.సౌజన్య, ఎస్. ఆర్. ఆర్. చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజీవ్ పాల్గొన్నారు.



చెస్ ఆడుతున్న క్రీడాకారులు



బహుమతులందుకున్న విజేతలు



కళాకారులకు సత్కారం


ప్రజాశక్తి - భవానీపురం : జానపద కళలను ప్రజలు, ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్మోహనరావు అన్నారు. ఆదివారం భవానీపురం హెచ్‌బి కాలనీలోని బొండా ఆర్ట్ గ్యాలరీలో పలువురు జానపద కళాకారులను బొండా జగన్మోహనరావు – లక్ష్మీ కుమారి దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజల హృదయాలను కదిలించే శక్తి జానపద కళాకారులకు ఉందని కొనియాడారు. సర్వోదయ సేవా మండలి రాష్ట్ర అధ్యక్షులు నరహరిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ సర్వమానవ సౌభ్రాతృత్వానికి జానపద కళాకారులు తమ వంతు సేవలను అందజేయాలని కోరారు. ప్రముఖ జానపద కళాకారుడు దామోదర గణపతి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయనను సత్కరించారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన జానపద కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా సర్వోదయ సేవ మండలి నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నరహరిశెట్టి శ్రీహరి, ఆకుల శ్రీనివాస్ కుమార్, బొండా జగన్మోహనరావు, తదితర కళాకారులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ వ్యాపారవేత్త రామినేని వెంకటేశ్వరరావు, దుర్గా బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ అల్లం పూర్ణచంద్రరావు, న్యాయవాది వివేకానందమూర్తి, శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : శారీరక, మానసిక ఆరోగ్యం సూర్య నమస్కారాలతోనే సాధ్యం అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. వసంత పంచమి,రథ సప్తమి పర్వ దినాలను పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ యోగసభ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వేకువజామున స్థానిక జిల్లా పరిషత్ కల్యాణ మండపంలో 100 మంది యోగ సాధకులతో 108 పర్యాయాలు సూర్య నమస్కారాల ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం నేపథ్యంలో జరిగిన సూర్య నమస్కారాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్య నమస్కారాలు కేవలం భౌతిక సాధన కాదని, మనస్సు-శరీర అవగాహనను కూడా పెంపొందించుకోడానికి దోహద పడతాయన్నారు. శారీరక, మానసిక భావోద్వేగ శ్రేయస్సుకు యోగా అనేది అత్యంత విశిష్టమైన వ్యాయామం అని అన్నారు. యోగాలో పలు ఆసనాలు, ప్రాణయామం లాంటి శ్వాసక్రియ అభ్యాసాలు, వివిధ భంగిమలతో కూడిన సూర్యనమస్కారాలు అలాగే ధ్యాన ముద్రలు భాగంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో 100 మంది 108 సార్లు సూర్య నమస్కారాలు,12 రకాల ఆసనాలు చేశారు. టీటీడీ ధర్మచారిని జొన్నలగడ్డ మాధవి భగవద్గీత పారాయణం చేశారు. ఈ మెగా ఈవెంట్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం చోటుచేసుకుంది. యోగా గురువులు ఘంటసాల గురునాథ బాబు, మద్దాల చింతయ్య, మహాలక్ష్మి, ముదిగొండ శాస్త్రి , ఆర్.డి ప్రసాదం తో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తెలుగు మాస్టర్ జయరాజు సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1984-85 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనానికి 60 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వారందరూ అరే ఒరే అంటూ పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. ఎవరెవరు ఎక్కడ ఉంటున్నారు అడిగి తెలుసుకున్నారు. విద్య బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులైన టి ఎస్ ఆర్ కె ప్రసాద్, కె జయరాజు, పి రామానుజచార్యులు, డి సాంబశివరావులను పూల మాలలు దుశ్శాలవాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జోక్స్ వేసుకుంటూ పాటలు పాడుతూ డాన్సులు చేశారు. మళ్లీ విద్యార్థి దశలోకి వచ్చామంటూ కేరింతలు కొట్టారు. వీళ్ళను చూసి ఉపాధ్యాయులు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సిహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనం లో కార్యదర్శి దామెర సీతారామయ్య, కోశాధికారి కోనేరు రవికుమార్, ఆత్మీయ కలయిక జీవితకాల స్పాన్సర్ కొల్లిపర శివప్రసాద్, సజ్జ శ్రీనివాసరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు కస్తూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



జగదీష్ కుమార్‌కు పతాకం అందిస్తున్న దృశ్యం

త్రిపుల్ జంప్‌లో జగదీష్‌కు మూడో స్థానం

ప్రజాశక్తి -నాగాయలంక : కేరళ రాష్ట్రంలోని త్రిసూర్ జిల్లా కున్నంకుళం గ్రామంలోని ప్రభుత్వ మోడల్ బాలుర హై య్యర్ సెకండరీ స్కూల్ స్టేడియంలో గత నెల 31 వ తేదీనుంచి నిర్వహిస్తున్న నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో 70ప్లస్ ఏజ్ గ్రూపులో మండలంలోని టి.కొత్త పాలెం శివారు మరియపురం గ్రామానికి చెందిన తూము జగదీష్ కుమార్ ప్రతిభ చాటారు. ఆదివారం మూడోరోజున జరిగిన త్రిపుల్ జంప్ పోటీల్లో ఆ వయస్సు లో కూడా యువకుడిలా దూకి మూడో స్థానం లో నిలిచాడని నాగాయలంక జెడ్పిపాఠశాల పీడీ గాజుల లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. గతంలో జాతీయ స్థాయిలో విశాఖ, హైదరాబాద్‌లలో జరిగిన అథ్లెట్ పోటీలో కూడా తూము జగదీష్ కుమార్ పాల్గొని విజేతగా నిలిచాడని పీడీ చెప్పారు. మండలానికి చెందిన పలువురు జగదీష్ కుమార్ కి ఫోన్లు చేసి అభినందించారు.

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో పేద ప్రజలకు న్యాయమైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 545 మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు కణితి శశిరేఖ హనుమకొండ దుర్గ భవాని, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగం శెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి గుడివాడ హెూమియో వైద్యులు పి భవాని, తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సిఎల్ వెంకటరావు

కోతుల దాడులతో ఇబ్బందులు



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం కోనయ్య చెరువు ఏరియా..తెల్లవారుజామున 4:00 సమయం. ఒక వ్యాన్ వచ్చి ఆగింది. జనాలు ఎవరూ లేరు. అంతే వ్యాన్ లో నుంచి దిగిన వ్యక్తి వెనుక డోర్ తీసేశాడు. ఒక్కసారిగా కోతులు, పిల్లల గుంపు రోడ్డుమీదకు ఉరికాయి. ఆ గుంపు అక్కడ నుంచి బయలుదేరి సొసైటీ పేట, ముస్లిం పేట లో ఇళ్లలో జనాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎవరైనా కర్రతో కూడదామని ప్రయత్నిస్తే వారి మీద ఎదురు తిరిగి దాడులకు తెగబడుతున్నాయి. ఆదివారం ముస్లింపేటలోని మహమ్మద్ దాదా ఇంటి 10 కోతులు హడావిడి చేశాయి. ఒడిలో పిల్లలు పెట్టుకున్న పెద్ద కోతి అతని మీద దాడికి దిగింది. కర్రతో బెదిరిద్దామని ప్రయత్నించగా ఆ కోతి వెళ్లి మరో నాలుగు కోతులను వెంటబెట్టుకొచ్చింది. అంతే మొత్తం కలిసి దాడికి సిద్ధమ య్యాయి. భయంతో దాదా ఇంట్లోనికి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత చుట్టుపక్కల వారంతా కర్రలతో రోడ్డు మీదకు రాగా కోతులు చెట్లపైకి ఎక్కి దమ్మంటే పట్టుకోండి అని సవాల్ విసిరాయి. కోతుల సమస్య గన్నవరం ప్రజలను వేధిస్తోంది. ఎక్కడో గ్రామాల్లో పట్టుకున్న కోతులను గన్నవరంలో వదిలిపెట్టడంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతర వ్యక్తం చేస్తున్నారు. వాటిని కొడదామని ప్రయత్నిస్తే దాడి చేసి కరుస్తున్నట్లుగా చెప్తున్నారు. పంచాయతీ అధికారులు ఎప్పటికైనా కోతులను పట్టించి అడవి ప్రాంతంలో వదిలి పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు ఇలాగే వదిలేస్తే కోతులు ఊరంతా విస్తరించే పరిస్థితి కనిపిస్తోంది.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు



జడ్జికి అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో కొండలరావు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి వారిని ఆదివారం సంధర్భంగా సుమారు 20 వేల పైగా భక్తులు దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు మరియు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వి వి సత్యనారాయణ మరియు వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

జడ్జి ప్రత్యేక పూజలు : గన్నవరం జూనియర్ సివిల్ జడ్జ్ బి. శిరీష కొండలమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకొన్నారు. దేవస్థానం సిబ్బంది, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించి కొండలమ్మ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేసినట్లు ఈవో తెలిపారు.

సజ్జా కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం టేకుపల్లి గ్రామంలో సజ్జా శేషగిరిరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఆదివారం టేకుపల్లి గ్రామంలో సజ్జ కుటుంబ సభ్యులను పరామర్శించారు. శేషగిరిరావు చెక్ పోస్ట్‌లో ఉద్యోగిగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట గ్రామానికి చెందిన అంబటి నాగరాజు, గంగిశెట్టి బాబూ రాజేంద్ర, పెదపూడి వీరబాబు, కంబాల నాగశ్రీను, అంబటి నాగ మల్లేశ్వరరావు, వంశీ, కొండూరు రాజేష్, నల్లూరి నాగేశ్వరరావు, మడమల రంజిత్ ఉన్నారు.



ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సిసి రోడ్లు పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి బీసీ కాలనీలో కొన్నిచోట్ల సీసీ రోడ్లు వేసి మరికొన్ని చోట్ల వేయకపోవడంతో వర్షాలకు ముంపుకు గురై నడవడానికి చాలా ఇబ్బందిగా ఉంటుందని, పల్లపు ప్రాంతాల్లో కూడా సిసి రోడ్ల నిర్మాణం చేయాలని కోరుతూ బిసి కాలనీ వాసులు ఎంఎల్‌ఏ కాగిత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని, సిసి రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్మాలపాటి రవి, వెంకటేశ్వరమ్మ, ఎస్. రజిని, పి. వెంకటేశ్వరమ్మ, స్వాతి పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్యులు, కృష్ణాజిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ప్రొఫెసర్. డా.భానుమూర్తి 500 వందల బాలికలకు నేత్ర పరీక్షలు నిర్వహించి 59 మందికి కళ్లజోళ్లు అవసరం అని నిర్ధారించారు. కంటిలో నరం సమస్య వున్న ఒక బాలికను మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ శిబిరంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి గోవాడ ప్రశాంతి, పాఠశాల ప్రిన్సిపల్, పాల్గొన్నారు.



మామిడి, మిరప తోటలు పరిశీలన

ప్రజాశక్తి - గంపలగూడెం : ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం గంపలగూడెం మండలకమిటీ నాయకులు గంపలగూడెం మండలం కనుమూరు, అనుముల్లంక గ్రామాల్లో నల్లనల్లివల్ల నష్టపోయిన మామిడి, మిరప తోటలను పరిశీలించారు. గత 5 సంవత్సరాలుగా నల్లనల్లీవల్ల పూర్తిగా నష్టపోతున్నామని, నష్టపరిహారం, పంటల భీమా వర్తింప చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు రైతు సంఘం జిల్లా ఆద్యక్షులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, పండ్ల తోటల ఆధ్యక్షులు చెరుకు విరారెడ్డి తెలిపారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.వీరభద్రం, రైతులు డి.భాస్కరరెడ్డి, పి.రాజగోపాల్ రెడ్డి, జి.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల జీవిత చరిత్రలను చదవాలి

ప్రజాశక్తి - తిరువూరు : ప్రజలలో వివిధ సమస్యలపై చైతన్యం పెంచేందుకు వివిధ రూపాల్లో కృషి చేసిన మహనీయుల గురించి నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తిరువూరు గ్రంథాలయ అధికారి కె.పద్మావతి అన్నారు. ఆదివారం లైబ్రరీలో పట్టణానికి చెందిన రచయిత ఎం.రాంప్రదీప్ చరిత్రలో దేశం కోసం తమ జీవితాలని త్యాగం చేసి పెద్దగా గుర్తింపుకు నోచుకోని కొంతమంది గొప్పవారి జీవిత విశేషాలను సంక్షిప్తంగా నేటి తరానికి తెలియచేయాలనే ఉద్దేశంతో 'విస్మృత మహనీయులు అనే పేరుతో రాసిన పుస్తకాన్ని ఆమె పరిచయం చేసి మాట్లాడారు.

'అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు'

ప్రజాశక్తి - నందిగామ : జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైసిపి నాయకులు వారి అవినీతిని కప్పిపుచ్చుకోవటం కోసం, జగన్ మెప్పు కోసం ఎంపి కేశినేని శివనాథ్‌పై గానీ, ఎన్డీయే కూటమి నాయకులపై గానీ తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదంటూ ఎన్టీఆర్ జిల్లా దిశ కమిటీ సభ్యురాలు నందిగామ మాజీ ఎంపీపీ రాష్ట్ర తెలుగు మహిళ మాజీ కార్యదర్శి మన్నే కళావతి, నందిగామ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు (బుజ్జి) హెచ్చరించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా ఎంపి కేశినేని శివనాథ్ అండదండలతో జరుగుతుందని నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు.



తిరుపతమ్మ దేవాలయంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - వత్సవాయి : గ్రామాల్లోని పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం వద్ద వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించేందుకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ వేలం పాటలు ద్వారా ఒక కోటి 72 లక్షల 36వేల 999 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఈవో కిషోర్ కుమార్ తెలిపారు. ఏడాది పాటు ఆలయం వద్ద యాత్రికులు సమర్పించు తలనీలాలు పోగు చేసుకుని హక్కునకు రూ.1.43 కోట్లు శ్రీనివాస హెయిర్ ఇండస్ట్రీస్ ఏలూరు, నేతి దీపారాధన ప్రమిదలు విక్రయించుకునే లైసెన్స్ హక్కుకు రూ.16.11 లక్షలు ఎస్.రాంబాబు, దేవస్థాన ప్రాంగణంలో ఐస్ క్రీమ్ విక్రయించుకునేందుకు లైసెన్స్ హక్కుకు రూ.6.25 లక్షలు రాజు, ఆలయ ప్రాంగణంలో నిమ్మకాయలు వాహన పూజ వద్ద పూజా సామాగ్రి పూలదండలు మినహా విక్రయించుకునే లైసెన్సు హక్కుకు 6,81,000 జి.గోపినాథ్ హెచ్చు పాటదారులుగా నిలిచి హక్కును సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఇ రమ ఉమాపతి, తిరుమలేశ్వరరావు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కంచికచర్ల : మండలంలోని మోగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986-87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన అలనాటి విద్యార్థులు సుమారు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకొని రోజంతా అత్యంత ఉల్లాసంగా ఉత్సాహంగా ఆనందోత్సాహాలతో గడిపారు. ఒకరినొకరు ప్రస్తుతం ఏహోదాలో ఉన్నారో పరిచయం చేసుకుంటూ ఉద్వేగభరిత క్షణాలు గడిపారు. ఆనాటి గురువులు తమను తీర్చిదిద్దిన విధానాల గురించి, తమ పురోభివద్ధికి గురువులు తోడ్పాటును ఎంతగానో తోడ్పడ్డారన్న విషయాలను నెమరు వేసుకున్నారు. 1986-87 పూర్వ విద్యార్థుల సదస్సును ఉద్దేశించి ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ మార్గదర్శకత్వంలో విద్యార్థులు నేడు ఉన్నత స్థితికి చేరుకోవటం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మూడు దశాబ్దాల తర్వాత కూడా తమ స్నేహ బంధాన్ని నిలుపుకుంటూ ఒకరినొకరు కలుసుకోవడం, స్నేహపూర్వక వాతావరణంలో తమ భావాలను



వ్యక్తీకరించుకోవడం అనందదాయకం అన్నారు. అలనాటి గురువులను, విద్యార్థులు శాలువాలతో, మొమెంటోలతో ఘనంగా సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బండి మల్లికార్జునరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, వెలగా సాంబశివరావు, రజిని, శారద, రమాదేవి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

వాగులో పడి ఇద్దరు వృద్ధులు మృతి

ప్రజాశక్తి - నందిగామ : చందాపురం గ్రామంలో శనివారం రాత్రి ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు వాగులో పడి ఊపిరి ఆడక మృతి చెందారు. వివరాలు ప్రకారం చందాపురం గ్రామానికి చెందిన మాతంగి జయరాజు(74), కనకపూడి సత్యం(64)లు పింఛను డబ్బులు తీసుకుని మద్యం కొనుగోలు చేసి చందాపురం నల్ల వాగు చప్టాపై కూర్చుని మద్యం సేవించి అపస్మారక స్థితిలో చప్టాపై నుండి వాగు నీటిలో పడి పోయారు. ఊపిరి ఆడక మృతి చెందారు. వీరికి భార్య, పిల్లలున్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాలను నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కంచికచర్ల : ప్రమాదవశాత్తు పొలంలో నీళ్ల కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కీసర గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు కంచికచర్ల మండలం పరిధిలో కీసర గ్రామానికి చెందిన ఆకులు పూర్ణచంద్రరావు (53) గండేపల్లి రోడ్డులో గల కౌలుకు తీసుకొని సాగుచేసిన టమాట తోటకు నీళ్లు పెడుతు కుంట వద్ద నీళ్లు తేవడానికి వెళ్లిన పూర్ణచంద్రరావు కాలుజారి నీటి కుంటలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు.





సారా నిర్మూలనపై గ్రామసభ

ప్రజాశక్తి - విస్సన్నపేట : తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల విసన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండా గ్రామంలో సారా నిర్మూలనపై గ్రామసభ/అవగాహనా సదస్సు ఆదివారం ఏర్పాటు చేశారు. ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకారియైన నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా చట్టరీత్యా నేరమని ఈ కేసుల్లో జైలుకు రిమాండ్ పంపటం తప్ప స్టేషన్ బెయిల్‌కు అవకాశం లేదని ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రమాదకరమైన సారా కేసుల్లో అలవాటు పడ్డ వారి మీద పీడీ యాక్టు పెట్టి 2 నుండి 3 సంవత్సరాలు జైలుకు పంపనున్నట్లు తిరువూరు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి.రామశివ (అసిస్టెంట్ ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్) విజయవాడ ఆర్.వి.రాశివ, ఎన్ఫోర్స్‌మెంట్ సిఐ విద్యా సుధాకర్ ఎస్ఐలు శేఖర్‌బాబు, వి.కృష్ణవేణి, సిహెచ్.వెంకట కుమార్, ఇలియాజ్, సిబ్బంది, వి.ఆర్ఒ పంచాయితీ సెక్రటరీ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : కృష్ణ గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కోడ్ నిబంధనలు అమల్లోకి వచ్చాయని నిబంధనలు పాటించాలని ఎంపిడిఒ జి.శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందన్నారు. కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాలు ఎటువంటి రాజకీయ పార్టీలు జండాలు ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో రాజకీయ నాయకులు ఫొటోలు ఉండకూడదని సూచించారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని కవులూరులో ఆదివారం జి.కొండూరుకు చెందిన విశ్వాక్ సేన్ ఆర్తో అండ్ జనరల్ క్లినిక్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 98 మంది రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందజేశారు. కీళ్ళు, ఎముకలు, నడుము నొప్పులకు జాయింట్స్ అరిగిన వారికి పలు రకాల పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివరాం మరీదు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వైసిపి ఫీజుపోరు పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - జి.కొండూరు : రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఫిబ్రవరి 5న జిల్లా పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు విద్యార్థి సంఘ నాయకులు రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు తెలిపారు. ఆదివారం ఈ మేరకు పోస్టర్ విడుదల చేశారు. కలెక్టర్ వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల తనిఖీలు

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలో పలుచోట్ల తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి శుక్రవారం విస్తతంగా పర్యటించి తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న పెట్రోల్ బంకులు పరిశీలించి, వినియోగదారులతో స్నేహంగా ఉండి కొలతలు సక్రమంగా ఉండాలని పెట్రోల్, డీజిల్ కొడుతున్న పంపు బాయ్‌లకు చెప్పారు. స్థానిక కెజిబివి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, తగు సూచనలు చేశారు. పక్కనే ఉన్న ఎపి మోడల్ స్కూల్‌ను సందర్శించి, పరిశీలన చేశారు. తిరుగు ప్రయాణంలో తోటమూలలో ఉన్న ఒక రేషన్ షాపును తనిఖీ చేశారు. వ్యత్యాసాలు రాకుండా చూడాలని డీలర్‌ను ఆదేశించారు.



దగా బడ్జెట్‌పై సిపిఎం శ్రేణుల ధ్వజం



మంగళగిరిలో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : రాష్ట్ర రాజధాని అమరావతికి కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని సిపిఎం నాయకులు ధ్వజ మెత్తారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా తాడేపల్లి పట్టణం ఉండవల్లి సెంటర్లో సిపిఎం శ్రేణులు నిరసన తెలిపాయి. సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, వేముల దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్ల కోసమేగాని ప్రజలకు ఉపయోగపడేలా లేదని, పేదల అభ్యున్నతికి ఏమాత్రమూ ఉపయోగపడని అన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా ఎన్‌డిఎలో భాగస్వామి పార్టీలైన టిడిపి, జనసేన నిలదీయకపోవడం దుర్మార్గమన్నారు. విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా అధికారం చేపట్టిన కూటమి పార్టీలు రాష్ట్ర ప్రజలను మరోమారు మోసం చేశాయని విమర్శించారు. ఒకవైపున ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, పేద మధ్యతరగతి సామాన్య ప్రజలపైన అధిక భారాలు వేసే కేంద్రంలోని బిజెపి విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని, రాజధానికి నిధులు కేటాయించని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తులో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఇ.రామారావు, ఇమ్మానుయేలురాజు, ఎన్.నాగేశ్వరరావు, బి.రామారావు, ఎస్‌కె బాష, కె.మేరీ, కె.శేషయ్య, ఎ.శౌరి, ఐ.ఇస్సాక్, డి.విజయ్, గాంధీ పాల్గొన్నారు. కుంచనపల్లి ప్రాతూర్ రోడ్డు, జాతీయ రహదారి వద్ద సిపిఎం శ్రేణులు నిరసన చేపట్టగా సిపిఎం మండల కార్యదర్శి పి.కృష్ణ, కాజా వెంకటేశ్వరరావు, జొన్న శివశంకరరావు, డి.వెంకటరెడ్డి మాట్లాడారు. ఎ.రంగా రావు, ఎన్.విజయరాజు, బి.శివారెడ్డి, కె.సాంబ శివరావు, ఎ.రామారావు, నాగరాజు, శ్రీనివాసరావు, సిహెచ్. వెంకటరెడ్డి పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మంగళగిరి :** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య విమర్శించారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో నిరసన చేపట్టగా రాఘవులు, చెంగయ్య మాట్లాడుతూ విభజన హామీలు, ప్రత్యేక హోదాకు సంబంధించిన అంశాలు బడ్జెట్లో ఏమీ లేవని అన్నారు. రాజధాని అమరావతి ప్రస్తావనే లేదని విమర్శించారు. అయినా ఈ బడ్జెట్‌కు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్వాగతిండం దారుణమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి టిడిపి, జనసేన పార్టీలు తాకట్టు పెడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వై.కమలాకర్, ఎం.బాలాజీ, నాయకులు ఎం.చంద్ర, ఎం.నాగేశ్వరావు, ఎం.చలపతిరావు, ఎస్.గణేష్, రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, ప్రజా సంఘాల నాయకులు ఎస్.కోటేశ్వరరావు, జానీబాష, సత్తార్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :** కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్ర రాజధాని అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం సిగ్గుచేటని సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు విమర్శించారు. మండలంలోని నిడమర్రులో సిపిఎం శ్రేణులు నిరసన చేపట్టగా భాగ్యరాజు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన దగ్గర నుండి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం రూ.1500 కోట్ల మాత్రమే కేటాయించిందని, ఈ తొమ్మిదేళ్లలో రాజధాని నిర్మాణానికి నిధులేమీ కేటాయించలేదని అన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ఆటలాడితే దానికి అనుగుణంగా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం.. రాజధాని అంశం రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకుంటాయని కోర్టుకు చెప్పాయని, ఇప్పుడు నిధులు కేటాయించకుండా విస్మరించాయని అన్నారు. రాజధానికి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామంటూ రాష్ట్రంలోని బిజెపి నాయకులు చెబుతున్నా చేతల్లో మాత్రం చిల్లిగవ్వకూడా ఇవ్వడం లేదన్నారు. ఈ బడ్జెట్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం చెబుతారని ప్రశ్నించారు. అప్పులు తెచ్చి రాజధానిని నిర్మిస్తామంటూ సిఎం చంద్రబాబు చెబుతున్నారని, మళ్లీ ఆ అప్పుల భారాన్ని ప్రజలపై మోపుతారా? అని నిలదీశారు. విభజన హామీలను అమలు చేయించుకుంటే అప్పులు చేయాల్సిన గతి ఉండదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధించాలన్నాని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.నాగేశ్వరరావు, ఎం.రాజముని, కె.ప్రకాష్‌రావు, కె.నాగేశ్వరరావు, యు.నాగరాజు, కె.వీరయ్య, ఎం.అంకమ్మరావు, కె.నానయ్య పాల్గొన్నారు. ఆత్మకూరులో నిరసన తెలిపారు.

నామినేటెడ్ పదవులు పొందిన నాయకులకు సన్మానం

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీలో పని చేస్తూ ఇటీవల కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పొందిన పలువురిని సీనియర్ జనసేన పార్టీ నాయకులు వల్లంశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి వైష్ణవి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. నియోజవర్గంలో నామినేటెడ్ పదవులు పొం దిన ఏపీ ఎంఎస్ ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మ శాలి కార్పొరేషన్ డైరెక్టర్ పి.మధుసూదన్‌రావు, మాదిగ కార్పొ రేషన్ డైరెక్టర్ బి.విజయశేఖర్‌ను సత్కరించారు. ఈ సంద ర్భంగా జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రసంగిస్తూ జనసేన పార్టీ ప్రజల కోసం పనిచేసే పార్టీ అని అన్నారు. కార్యక్రమం లో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, నాయ కులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, బి.నాగేశ్వ రావు, సుంకరరామారావు పాల్గొన్నారు.



పేదలకు ఇళ్ల కోసం 7న ధర్నా : సిపిఎం



ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరంలో పేదలకు గృహ నిర్మాణ పథకం ద్వారా నివాస ప్రాంతాల్లోనే ఇల్లు నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి పి.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ అంశంపై 7న ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. వడ్డేశ్వరంలో ఇళ్ల స్థలాలు పట్టాల బాధితులతో సమావేశం కె.స్వాతి అధ్యక్షతన ఆదివారం జరిగింది. పి.కృష్ణతోపాటు సిపిఎం సీనియర్ నాయకులు డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.5 లక్షలివ్వాలని, మరో ఐదు రూ.లక్షలు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన లేఅవుట్ ప్లాట్లలో ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించి, ఇల్లు నిర్మించుకునేందుకు అడ్డు లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసినా ఇళు నిర్మించలేన్నారు. అర్హులైన పేదలకు రాజధాని ప్రాంతంలో ఇల్లు కేటాయిస్తామని గత ప్రభుత్వం చెప్పి, రాజధానిలో కేటాయించారని, కూలి నాలి చేసుకునే పేదలు అక్కడికెళ్లి ఉపాధి చూసుకోవాలంటే కష్టసాధ్యమని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా, నివాస ప్రాంతాల్లోనే పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలాలిచ్చి ఇళ్ల నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంగళగిరిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద 7వ తేదీన జరిగే ధర్నాలో పేదలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు వి.రాజు, వి.చిన్న, వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన పండుగ

ప్రజాశక్తి-గన్నవరం : శ్రీ బాల యేసు దేవాలయం విచారణ కర్తలు పసల తోమాస్ ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వత్తుల ప్రదర్శన కార్యక్ర మాన్ని ఆదివారం నిర్వహించారు. విచారణలోని క్రైస్తవ సహోదరీ సహోదరులు కొవ్వొత్తులను చేత బూని భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఫాదర్ రాకేష్ ఫాదర్ వినోద్ పాల్గొన్నారు అనంతరం నిర్వహించిన దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విచారణ ఉపదేషులు, మరియదళ సభ్యులు సంఘ పెద్దలు భక్తులు ఈ పండుగను కొనియాడారు.



శ్రమదానం చేస్తున్న రెడ్ వాలంటీర్లు

రెడ్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-గన్నవరం : పుచ్చలపల్లి సుందరయ్య రెడ్ వాలంటీర్స్, చిక్కవరం గ్రామంలోని జయశ్రీ పాలిమర్స్ కార్మికులు కలసి గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్, చెరువు కట్ట పైన శ్రమదానం చేసి శుభ్రం చేశారు. సామాజిక సేవా కార్యక్ర మాల్లో రెడ్ వాలంటీర్లు ముందుండి పనిచేయడం అభినం దనీయమని గ్రామ ప్రముఖులు ముక్కామల పండుమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

జడ్‌పి పాఠశాల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ సబ్ జోన్ 84వ మెమోరియల్ నియోజకవర్గస్థాయి బాలికల ఆటలు పోటీలలో జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు విభాగాలలో పథకాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో షటిల్ బ్యాడ్మి ంటన్ విభాగంలో ప్రథమ స్థానం, టెన్నికాయిట్‌లో ద్వితీయ స్థానం సాధించగా జూనియర్స్ విభాగంలో త్రో బాల్, షటిల్ బ్యాట్మెంటన్, టెన్నికాయిట్‌లలో కూడా విజయం సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యా తలు తీసుకొచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీఈటీల ను ఉపాధ్యాయులు అభినందించారు.

ఐక్యతతో రాజ్యాధికారాన్ని సాధించొచ్చు : మంత్రి

ప్రజాశక్తి - మంగళగిరి : బీసీలు ఐక్యతతో రాజకీయాభివృద్ధి సాధిస్తే రాజ్యాధి కారాన్ని అందిపుచ్చుకోవచ్చని మంత్రి ఎస్ సవిత అన్నారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన్న శంకర్రావు అధ్యక్ష వహించారు. మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలంతా ఒకే వేదిక మీదకు రావడం సంతోషంగా ఉంద ని అన్నారు. తమ హక్కుల కోసం పోరాటం చేసి నేడు రాష్ట్ర మంత్రివర్గంలో ఎక్కువ మంది బిసి మంత్రులు ఉండే విధం గా చేయగలిగామని అన్నారు. బీసీలు మరింత ఐక్యంగా ఉంటే శాసించే స్థాయికి ఎదగవచ్చునని అన్నారు. బీసీలలో చిన్నప్పటి నుండే పిల్లలను చదివించా లని ఆమె కోరారు. చదువు ఉంటే రాజకీయం గా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెంద వచ్చునని అన్నారు. బీసీలు ఒకరోజు పని చేయకపోతే అభివృద్ధి నిలిచిపోతుందని మంత్రి అన్నారు. చట్టసభలలో బీసీల రిజర్వేషన్ కోసం పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం యువజన జాతీయ కార్యదర్శి కే క్రాంతి కమార్, గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ జి గురుమూర్తి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు చంద్రకళ, గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.మహేష్, స్థానిక బీసీ సంక్షేమ సంఘం నాయకులు టి. కిరణ్, యు.శ్రీనివాస రావు, కే.శివరాం బాబాజీ, మహిళా నాయకులు కె స్వాతిగౌడ్ పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పికిల్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, నగరంలోని హెచ్‌సిజి క్యూరీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాన్సర్ ఛాంపియన్‌లు, క్లినిషియన్‌లు, సంరక్షకుల కోసం ఆహ్లాదకరమైన, సమ్మిళిత పికిల్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించింది. 'యునైటెడ్ బై యూనిక్' అనే అంతర్జాతీయ నేపథ్యంతో సమలేఖనం చేయబడిన ఈ కార్యక్రమం, క్రీడల ద్వారా ఐక్యతా భావాన్ని పెంపొందిస్తూ, క్యాన్సర్ ఛాంపియన్‌ల వ్యక్తిగత విజయాల బలం, స్థిరత్వం, ప్రత్యేకమైన ప్రయాణాలను వెల్లడి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. దాదాపు 30 మందికి పైగా పాల్గొన్న ఈ కార్యక్రమం క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాటంలో ఐక్యంగా ఉన్న శక్తివంతమైన కమ్యూనిటీని ఒకచోట చేర్చిందని హెచ్‌సిజి క్యూరీ సిటీ క్యాన్సర్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తెర్లి యువ కిశోర్ పేర్కొన్నారు.

శారద కళాశాల సందర్శన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు చదువుతో పాటు ఆధ్యాత్మిక భావాలు కూడా అలవర్చుకోవాలని ప్రముఖ ఉపన్యాసకులు, ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. గాంధీ నగర్‌లోని శారద కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన కళాశాలను సందర్శించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఆధ్యాత్మిక భావాలు కూడా అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికత ద్వారా మంచి క్రమశిక్షణ అలవడుతుందన్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా మంచి విద్యా సంస్థలు ప్రారంభించి విద్యార్థులకు చక్కటి విద్య అందిస్తున్నారని ఈ విద్యా సంస్థ రానున్న కాలంలో మరింత ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు. విదార్థులు ఎంతటి ఉన్నత స్థాయిలో ఉన్నా చదువుకున్న విద్యా సంస్థను, గురువులను, కన్న తల్లిని మరువకూడదని అన్నారు. అనంతరం శారద ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ కుందా రామ నారాయణ, ట్రెజరర్ ఎస్. ఎన్. వి.ప్రసాద్ ఘనంగా సత్కరించారు.



స్ఫూర్తి శ్రీనివాస్‌కు బంగారు పతకం

విజయవాడ : నగరానికి చెందిన చిత్రకారుడు 'స్ఫూర్తి' శ్రీనివాస్ స్వామి వివేకానంద స్ఫూర్తి ఇండియన్ ఐకాన్ పురస్కారం 2025, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం, గోల్డ్ మెడల్ పొందారు. 20 సంవత్సరాలుగా చేసిన సేవలకు, 100కు పైగా నిర్వహించిన ఆర్ట్ ఈవెంట్స్‌కి గత 30 సంవత్సరాలుగా చిత్రకళోపాధ్యాయుడిగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా 'స్ఫూర్తి' శ్రీనివాస్‌కి ఈ పురస్కారాలు లభించాయి. 'జాతీయ స్థాయి స్వచ్ఛంద సేవా సంస్థ – తెలుగు వెలుగు సాహితీ వేదిక' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అందుకున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. పిచ్చుకను చేసుకుందామా మచ్చిక అనే నినాదంతో జాతీయ స్థాయిలో చేసిన సేవ్ స్పారో ఉద్యమానికి, కళనీ కళా సంస్కృతిని పెంపొందించేందుకు చేసిన సేవలకు గానూ ఈ గుర్తింపు లభించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో జాతీయ స్థాయి అవార్డులు కళాకారుడిగా, ఉపాధ్యాయుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా తన బాధ్యతను మరింత పెంచిందని సంతోషాన్ని వ్యక్తపరిచారు.



అధునాతన సిటీ ఎఫ్‌ఎఫ్‌ఆర్ టెక్నాలజీ ఆవిష్కరణ



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గుండె సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు దేశంలోనే తొలిసారిగా నగరంలోని ఆస్టర్ రమేష్ హాస్పటల్‌లో 'ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో సిటీ ఎఫ్‌ఎఫ్‌ఆర్ టెక్నాలజీ ఆవిష్కరణ చేసినట్లు రమేష్ హాస్పటల్ చీఫ్ కార్డియాలజిస్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో ప్రివెంటివ్ కార్డియాలజీ విభాగంలో డాక్టర్లు గుండెపోటు ముప్పును ముందుగా గుర్తించేందుకు ఇసిజి, ఎకో, ట్రెడ్మిల్, వంటి సాంప్రదాయ పరీక్షలపై ఆధారపడకుండా ప్రాథమిక రోగ నిర్ధారణ కోసం కాల్షియం స్కోర్, సిటీ యాంజియోగ్రామ్ పరీక్షలను మొదటి ఎంపికగా ఉపయోగిస్తున్నారని అన్నారు. అధునాతన ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ, రికారెంట్, మల్టీ లేయర్, డీప్ న్యూరల్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, వంటివి గుండె, మెదడు, క్యాన్సర్ జీనోమ్ సింగిల్ సెల్ అట్లాస్ వంటి అంశాలకు సంబంధించి హై రిజల్యూషన్ ఇమేజింగ్ ద్వారా వైద్య రంగంలో మరింత కచ్చితమైన రోగ నిర్ధారణ చికిత్సలను అందించడంలో సహాయపడతాయన్నారు. గుండె సమస్యలు ఉన్నవారికి క్యాత్ ల్యాబ్ లోకి వెళ్ళే ముందు పేషెంట్‌కు స్టెంట్ అవసరమా..? ఎన్ని స్టెంట్స్ అవసరమవుతాయి..? స్టెంట్ సైజ్ ఎంత ఉండాలి ఇవన్నీ సిటీ ఎంజియోగ్రామ్ ఎఫ్.ఎఫ్.ఎఫ్ (ఫ్రెక్షనల్ ఫ్లో రిజర్వ్), ఫ్లాక్ మార్ఫాలజీ ద్వారా ముందుగానే తెలుసుకోవచ్చని అన్నారు. 2011లో ఆస్టర్ రమేష్ హాస్పటల్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తొలిసారిగా 256 స్లైస్ సిటీ స్కానర్ ఏర్పాటు చేసి సిటీ కాల్షియం స్కోర్, సిటీ ఎంజియోగ్రామ్ పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 30 వేలకి పైగా సిటీ ఎంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించగా వారిలో 2 వేల మందికింపైగా రోగుల్లో తీవ్ర గుండె సమస్యలను ముందుగా గుర్తించి గోల్డెన్ అవర్‌లో తగిన వైద్యం అందించడంతో వారి ప్రాణాలను రక్షించినట్లు తెలిపారు. 25 వేల మందికి పైగా రోగుల్లో 10 శాతం నుండి 60 శాతం వరకు గుండె రక్తనాళాల్లో పూడికలు, కాల్షియం స్కోర్ 1 నుండి 1000 వరకు గుర్తించి వీటిని అదుపులో ఉంచేందుకు మందులు, వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సూచించడం ద్వారా గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచి సమర్ధవంతమైన ముందస్తు వైద్యం అందించినట్లు తెలిపారు. అధునాతన సిటీ స్కాన్, ఎ.ఐ.ఆధారిత ప్రివెంటివ్ కార్డియాలజీ ద్వారా గుండె సంబంధిత సమస్యలను ముందుగా గుర్తించి సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో గుండె వైద్య నిపుణులు పాల్గొన్నారు.

కాబోయే అమ్మల ర్యాంప్ వాక్

వినూత్నంగా అను మై బేబీ 3వ వార్షికోత్సవం



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : త్వరలో అమ్మలు కాబోతున్న మహిళలు ర్యాంప్‌పై తళుక్కుమన్నారు. పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న స్త్రీమూర్తుల ఆత్మవిశ్వాసం ర్యాంప్ వాక్‌ను మరింత అందంగా మార్చింది. అను మై బేబీ 3వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం వినూత్నంగా నిర్వహించారు. ఎనికేపాడు అను మై బేబీ హాస్పిటల్ నందు జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ తార పూర్ణ.. కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ, పాశ్చాత్య వస్త్రధారణతో కాబోయే అమ్మలు ర్యాంప్ వాక్ చేయడం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ సందర్భంగా సినీ హీరోయిన్ పూర్ణ మాట్లాడుతూ.. అను మై బేబీ వార్షికోత్సవ సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. కాబోయే అమ్మల ర్యాంప్ వాక్‌లో భాగస్వామ్యం కావడం తనకు అద్భుతమైన అనుభూతినిచ్చిందని తెలిపారు. విజయవాడ నగరంలో నారీ శక్తికి నిజమైన నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలిచిపోతుందని పూర్ణ వ్యాఖ్యానించారు. అనంతరం, అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీదేవి మాట్లాడుతూ అను మై బేబీ మూడేళ్ల ప్రస్థానంలో అనేక మైలురాళ్లను అధిగమించిందని అన్నారు. విశిష్టానుభవం కలిగిన వైద్య నిపుణులతో, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అను మై బేబీలో వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. అనేక క్లిష్టమైన కేసుల్లో సైతం తమ వైద్యులు అత్యంత నైపుణ్యంతో చికిత్సనందించి చరిత్ర సృష్టించారని తెలిపారు. అను మై బేబీలోని ప్రపంచ స్థాయి సదుపాయాల ద్వారా హైరిస్క్ ప్రెగ్నెన్సీ, వాటర్ బర్త్, పెయిన్ లెస్ డెలివరీ సేవలను అందిస్తున్నామని వెల్లడించారు. సేఫ్ హాండ్స్ ప్రోగ్రామ్ ద్వారా 80 కిలోమీటర్ల పరిధిలో ఎమర్జెన్సీ నియోనేటల్ చికిత్సలను అందుబాటులోకి తెచ్చామని అన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఒకే ఒక్క ఫోన్ కాల్ ద్వారా నవజాత శిశువులకు అత్యాధునిక అత్యవసర చికిత్సలను అందిస్తామని తెలిపారు. ఇందు కోసం వెంటిలేటర్, తదితర వసతులతో అంబులెన్స్, ప్రత్యేక ఎన్ఐసియు విభాగం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అను మై బేబీ వార్షికోత్సవ స్ఫూర్తితో, ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలందించాలనే తమ లక్ష్య సాధనలో పునరంకితమవుతామని డాక్టర్ శ్రీదేవి తెలిపారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న గర్భిణీలను అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అను మై బేబీ వైద్యులు డాక్టర్ కవిత, డాక్టర్ పావని, డాక్టర్ మంజు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిమెట్లకు పూర్వ వైభవం

అఖండ -2 సినిమా షూటింగ్ పరిశీలనకు బోయపాటి రావడంతో గుడిమెట్ల వైపు అందరి చూపు



ప్రజాశక్తి - నందిగామ : గుడిమెట్ల ప్రాంతం చరిత్ర తెలిపే ఏడు కోటలకు ఎత్తయిన నిదర్శనం. రాజులు... రాచరిక పాలనతో కృష్ణానది ఒడ్డున గుడిమెట్లలో శివకేశవ ఆలయాలు ప్రాచుర్యం పొందాయి. కృష్ణమ్మ ఒంపుసొంపుల కనువిందు చేసే ప్రకృతి రమణీయతకు ఇది అందాల కేంద్రం. శతాబ్దాల చరిత్ర కలిగి అభివృద్ధికి ఆమాడదూరంలో ఉండిపోయిన చందర్లపాడు మండలం గుడిమెట్ల క్షేత్రానికి పూర్వ వైభవం రానుందా? నటుడు నందమూరి బాలకృష్ణ హీరోగా అఖండ 2 చిత్ర నిర్మాణ నేపథ్యంలో దర్శకుడు బోయపాటి శ్రీను దృష్టి గుడిమెట్ల ప్రాంతంపై పడటంతో ఈ ప్రాంతం అభివృద్ధి చేసి పర్యాటకం పేరు తీసుకురావడానికి ప్రభుత్వం యోచిస్తోంది. చుట్టూ కొండలు వాటి మధ్య ఒంపుసొంపుల తిరుగుతూ ప్రవహించే కృష్ణానది అందాలతో కనువిందు చేసే గుడిమెట్ల గ్రామానికి శతాబ్దాల చరిత్ర ఉంది. పదకొండవ శతాబ్దంలో గుడిమెట్ల కొండలపై ఏడు కొండలపైన ఏడు కోటలుండేవి. ఆ కోటలలో రాజులు వుండేవారు. ఏడు పేటలలో ప్రజలు నివసించేవారు. అప్పట్లో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆ కొండలపై శివ, కేశవ ఆలయాలు నిర్మించారు. భారీగా బంగారు ఆభరణాలు, బంగారు విగ్రహాలు ఆలయాలలో ఏర్పాటు చేశారు. కాల క్రమేణా కలరా, మశూచి, ప్లేగు, అంటు వ్యాధులు తరచూ సోకుతుండటంతో చాలా మంది ప్రజలు చనిపోయారు. అంటు వ్యాధులకు అడ్డుకట్ట వేసే క్రమంలో కొండలపై నుండి ప్రజలను దూరంగా తీసుకువచ్చి కొత్తగా ఒక గ్రామాన్ని నిర్మించారు. ఆ గ్రామమే నేడు రామన్నపేట (గుడిమెట్ల)గా పిలవబడుతుంది. రాజులు, రాజ్యాలు పోవడంతో కాలక్రమంలో మేణా, కోటలు కనుమరుగయ్యాయి. రాజులు నిర్మించిన ఆలయాలు కావడంతో గుప్త నిధులు ఉంటాయన్న దురాలోచనతో దొంగలు ఆ ఆలయాలను కొల్ల కొట్టారు. ఊరికి దూరంగా ఉండటంతో పూజారులు కూడా నిత్య నైవేద్యాలు పెట్టకుండా వదిలేశారు.

పుష్కరాల పుణ్యమా అని...

2004లో కృష్ణా పుష్కరాల సందర్భంగా శివకేశవ ఆలయాలకు జీర్ణోధరణ పనులు చేపట్టారు. అప్పటినుంచి ఆలయాలు యాత్రికులతో కళకళలాడుతున్నాయి. ఆ సమయంలో ఆలయాలకు దిగువగా ఒక రైతుపొలంలో శ్రీ మహాలక్ష్మి అప్పురూప విగ్రహం బయటపడింది. చారిత్రక నేపథ్యం కలిగిన ఆ విగ్రహం విలువ 100 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనాలు ఉన్నాయని గ్రామస్తులు ప్రభుత్వానికి అందజేశారు. ఆ ప్రాంతంలో రాజులు అనేక గుప్త నిధులు దాచి ఉంటారని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. రాచరికపు కాలంలో వజ్ర వైఢుర్యాలకు కొదవలేదని కొన్ని ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. తొలకరి వర్షాలు పడిన ప్రతిమారు ఈ ప్రాంతంలో వజ్రాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు గుంటూరు జిల్లా చెందిన ప్రజలు ఇక్కడ వజ్రాలు కోసం వెతుకుతున్నారు. అందాల కొండలు కృష్ణమ్మ పరవళ్ళు ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యం తెలిస్తే దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ అఖండ 2 సినిమా నిర్మించుకున్నట్లు తెలిసింది. అందమైన గుడిమెట్ల కొండలపై నుండి కృష్ణానది వైపు చూస్తే కొండల మధ్య ఒంపుసొంపులు పరవాలతో కృష్ణమ్మ కనువిందు చేస్తుంది. గుడిమెట్ల నుంచి 20 కిలోమీటర్ల మేర కృష్ణానది అత్యంత లోతుగా ఉంటుంది. చరిత్రలో ఎన్నడు ఈ ప్రాంతంలో కృష్ణా నది ఎండిన దాఖలాలు లేవు. ప్రకాశం బ్యారేజీలో బ్యాక్ వాటర్ తగ్గినా ఈ ప్రాంతంలో నీరు ఉంటుంది. అందుకే షూటింగ్‌కి ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తుంది.

అఖండ 2 సినిమా చిత్రీకరణ ద్వారా గుడిమెట్ల గ్రామం మరో మారు ప్రచారంలోకి వచ్చింది. సహజ వనరులకు నెలవైన ఈ ప్రాంతం తిరిగి గత వైభవాన్ని చాటుకుని ఈ చిత్రం దాఖలు చేస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత టిడిపి ప్రభుత్వం అమరావతి నుంచి ముక్త్యాల వరకు ఫ్రెంచ్ ఏర్పాటు చేసి బోట్ షికారు జల రవాణా ఏర్పాటు చేయాలని సూచించింది. ఆమేర కొంత పనులు కూడా జరిగాయి. ఈ దశలో ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో టూరిజంపై ప్రత్యేక శ్రద్ధతో బోట్ షికారుకు కంచి ఏర్పాటు చేయడంతో పాటు అలకానంద ప్రాజెక్టు పనులు పూర్తయితే ఈ ప్రాంతం పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతుంది. అఖండ 2 చిత్రంతో పాటు పలు చిత్రాల నిర్మాణాలకు ఈ ప్రాంతం కేంద్రం కానుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హీరో బాలకష్ణ రాక కోసం ప్రజలు వేచి ఉన్నారు.